

ప్రభల తేజస్సు

శ్రీపద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం అమ్మవారు సూర్య,చంద్రప్రభలపై ఊరేగారు.



21న సూళ్లూరుపేటకు సీఎం జగన్

సూళ్లూరుపేట నియోజకవర్గానికి ఈనెల 21 న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేయనున్నారు. తిరుపతి జేసీ బాలాజీ ఏర్పాట్లను పరిశీలించారు.



23 నుంచి విశేష హోమం

అలిపిరిలోని సప్తగో ప్రదక్షిణ మందిరంలో ఈ నెల 23న శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమం జరుగుతుందని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి తెలిపారు.

న్యూస్‌రీల్

వినాయకుని దర్శించుకున్న సీఆర్‌పీఎఫ్ ఐజీ వెంకటకృష్ణ



సీఆర్‌పీఎఫ్ ఐజీ వెంకటకృష్ణకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారిని సీఆర్‌పీఎఫ్ ఐజీ వెంకటకృష్ణ గురువారం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం ఆయన కుటుంబ సమేతంగా దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి వారికి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాటు చేశారు. దర్శనానంతరం ఆశీర్వాద మండపంలో ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం పలికి, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం ఆలయ ఇన్‌స్పెక్టర్లు రమేష్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో అక్మల్ ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

యాదమరి: మండలంలోని 14 కండిగ ముస్లింవాడ ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థి మహమ్మద్ అక్మల్ రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం భాస్కర్‌రావు తెలిపారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మహమ్మద్ అక్మల్ నవంబర్ 11వ తేదీ నుంచి మూడు రోజుల పాటు గుంటూరు జిల్లా బాపట్లలో జరిగిన రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరచడంతో అతనిని గురువారం పాఠశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ వసంతవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

21 నుంచి జిల్లాలో ప్రైమ్ 2.0 అమలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈనెల 21వ తేదీ నుంచి ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్ ద్వారా రిజిస్ట్రేషన్ నిర్వహించనున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ విధానంలో డ్యాకుమెంట్, చెక్‌స్లిప్‌ను వినియోగదారులు సిద్ధం చేసుకుని కార్యాలయాలకు రావాలన్నారు. తదనంతరం రిజిస్ట్రేషన్ ప్రారంభించి క్రయ, విక్రయ, సాక్షులు, సబ్ రిజిస్ట్రార్ డిజిటల్ సంతకాలతో రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. నూతన సాఫ్ట్‌వేర్‌ను ప్రస్తుతం అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పరీక్షిస్తున్నామని చెప్పారు.

రైతులందరికీ న్యాయం చేస్తాం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

గుడిపాల: చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవేలో అదనంగా తీసుకున్న భూమికి సంబంధించి రైతులకు న్యాయం చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో భూములు కోల్పోయిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులందరికీ న్యాయం చేస్తామన్నారు. రైతులు మాట్లాడుతూ ఎకరాకు కనీసం రూ.30 లక్షలు ఇవ్వాలని, కొబ్బరి, మామిడి చెట్లకు తమిళనాడు తరహాలో నష్టపరిహారం అందించాలని కోరారు. ఎక్స్‌ప్రెస్ హైవే అధికారులు దాము, గణేష్ పాల్గొన్నారు.

నేడు జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశం



జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె రత్నారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం జిల్లా వ్యవసాయమండలి సమావేశం నిర్వహించనున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ గురువారం తెలిపారు. ఈ సమావేశంలో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ సగిలి షణ్మోహన్‌తోపాటు జిల్లాకు చెందిన ముఖ్యమైన అధికారులు పాల్గొంటారని తెలిపారు.

వంటకు లేదు తంట

నాడు : టీడీపీ ప్రభుత్వ హయాంలో సర్కారు పాఠశాలల పరిస్థితి దయనీయం. అప్పట్లో కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాసిన విషయం అందరికీ తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే మధ్యాహ్న భోజన పథకాన్ని సైతం ప్రైవేట్ ఏజెన్సీలమయం చేశారు. సరైన మెనూ, ఉన్న మెనూ సైతం సక్రమంగా అమలు చేసేవారు కాదు. వంట కార్మికులకు జీతాలు సరిగ్గా ఇచ్చేవారు కాదు.

నేడు: వైఎస్సార్ సీపీ పరిపాలనలో సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిచ్చి, రూ.వేల కోట్లు ఖర్చు చేశారు. అలాగే మధ్యాహ్న భోజన పథకంలో పలు మార్పులకు శ్రీకారం చుట్టారు. జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలు చేసి, రోజుకు ఒక మెనూ అమలు చేశారు. వంట కార్మికులకు సకాలంలో జీతాలు మంజూరు చేస్తున్నారు. తాజాగా హైస్కూళ్లకు నాణ్యమైన వంట సామగ్రిని పంపిణీ చేశారు.

ఆకలి విద్యకు ఆటంకం కాకూడదు.. పేద పిల్లలు కడుపునిండా తినాలి.. కళకళలాడుతుండాలి.. అక్షరాస్యత పెంపొందాలి.. చదువు మానేసిన చిన్నారులు బడి బాట పట్టాలన్నదే ప్రభుత్వ సంకల్పం. అందుకే రోజుకో మెనూతో పౌష్టికాహారం పెట్టడానికి జగనన్న గోరుముద్ద పథకం అమలు చేసింది.. విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి రాగి జావా ఇచ్చింది.. నేడు వంట కార్మికుల కష్టాలు తీర్చేందుకు స్టెయిన్‌లెస్ స్టీలు పాత్రలు అందజేసింది. ఇక కష్టాలు లేని వంటకు మార్గం సుగమనం చేసింది.

పెనుమూరు మండలం గుడ్యాణంపల్లె జెడ్పీ హైస్కూల్‌లో వంట సామగ్రిని పరిశీలిస్తున్న డీఈఓ విజయేంద్రరావు



పాఠశాలలకు సరఫరా చేసిన నాణ్యమైన వంటసామన్లు



- జిల్లాలోని ప్రభుత్వ హైస్కూళ్లకు చేరిన వంటసామగ్రి కిట్లు
- సిల్వర్ పాత్రల స్థానంలో నాణ్యమైన స్టీలు పాత్రలు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా 2,478 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల కష్టాలు తీరనున్నాయి. ఎన్నో ఏళ్ల క్రితం అందజేసిన సిల్వర్ వంట పాత్రలతోనే మధ్యాహ్న భోజన కార్మికులు వంట వండేవారు. వారి కష్టాలను తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు సిల్వర్ వంట పాత్రల స్థానంలో నాణ్యమైన స్టీలు వంట పాత్రలను సరఫరా చేసింది. ప్రభుత్వం సరఫరా చేసిన వంటపాత్రలను జిల్లా వ్యాప్తంగా 2,129 హైస్కూళ్లకు అధికారులు అందజేశారు.

గతంలో పట్టించుకోని టీడీపీ

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థుల హాజరు శాతం పెంచడానికి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టింది. 2010లో వంట తయారీకి అవసరమైన పాత్రలను అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసింది. తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం వీటి గురించి పట్టించుకోలేదు. అరకొర పాత్రలతోనే ఏజెన్సీ సిబ్బంది వంట చేస్తున్నారు. కొన్ని స్కూళ్లలో వంట పాత్రలే లేకపోవడంతో ఏజెన్సీకి చెందిన మహిళలే సమకూర్చుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ×జగనన్న గోరుముద్ద పథకం₹ అమలు చేస్తున్నారు. మెనూపై ప్రత్యేక దష్టి సారించి, విద్యార్థులకు అందించే పోషకాహారంలో ×రాగిజావ₹ కూడా చేర్చారు. ఇన్ని రకాల వంటల తయారీకి సరిపడా పాత్రలు లేక అగచాట్లు పడుతున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళల కష్టాలు తీర్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతి ఏజెన్సీకి అత్యంత నాణ్యతతో కూడిన ×స్టెయిన్‌లెస్ స్టీలు పాత్రలు₹ అందించేందుకు చర్యలు చేపట్టింది. గతంలో ఉన్న సిల్వర్ పాత్రల స్థానంలో స్టీలు పాత్రలను సరఫరా చేసింది. ఇప్పటికే జిల్లా కేంద్రం నుంచి అన్ని మండల కేంద్రాలకూ ఈ కిట్లు చేరాయి. ఎంఈఓల ఆధ్వర్యంలో వాటిని భద్రపరిచారు. అక్కడి నుంచి పాత్రలను పాఠశాలలకు తరలించనున్నారు.

2,129 స్కూళ్లకు వంటపాత్రలు

జిల్లా వ్యాప్తంగా 2,129 ప్రభుత్వ పాఠశాలలకు వంట సామగ్రి అందజేశారు. ఆయా మండలాల ఎంఈఓల పర్యవేక్షణలో వాటిని పాఠశాలలకు పంపిణీ చేశారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా 5 నుంచి 11 రకాల వంట సామగ్రి కిట్లను అందజేశారు. మండల కేంద్రాల నుంచి ఎండీయూ వాహనాల ద్వారా ఆయా స్కూళ్లకు చేర్చారు. ఇందుకు సంబంధించిన రవాణా బిల్లులు కూడా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లా వ్యాప్తంగా కిట్లను సరఫరా చేసేందుకు ఏడు నియోజకవర్గాలకు రూ.3,19,350 ను ప్రభుత్వం మంజూరు చేసిందని అధికారులు వెల్లడించారు.

వంట సామగ్రి పంపిణీ వివరాలివీ..

నియోజకవర్గం పేరు	సామగ్రి పంపిణీ చేసిన స్కూళ్లు
చిత్తూరు	186
జీడీ నెల్లూరు	423
కుప్పం	96
నగరి	180
పలమనేరు	463
పుంగనూరు	410
పూతలపట్టు	371
మొత్తం	2,129

మధ్యాహ్నభోజనానికి అధిక ప్రాధాన్యం



రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు పెట్టే మధ్యాహ్నభోజనానికి అధిక ప్రాధాన్యతనిస్తోంది. రోజుకో మెనూ అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేస్తోంది. మధ్యాహ్న భోజన కార్మికుల సౌకర్యార్థం గుర్తించిన పాఠశాలలన్నింటికీ వంట సామగ్రి కిట్‌ను ప్రభుత్వం పంపిణీ చేసింది.

– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

చాలా నాణ్యంగా ఉన్నాయ్..



మధ్యాహ్న భోజనం తయారీకి, వడ్డించేందుకు ప్రభుత్వం పంపిణీ చేసిన స్టీలు పాత్రలు చాలా క్వాలిటీ ఉన్నాయి. గతంలో ఉన్న పాత్రలతో వంటలు తయారు చేయాలంటే మధ్యాహ్న భోజన సిబ్బంది ఇబ్బందులు పడేవారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం వంట సామగ్రిని పాఠశాలలకు పంపిణీ చేసింది. వంట సామగ్రి కిట్లను అన్ని పాఠశాలలకు పంపిణీ చేశాం.

– విజయేంద్రరావు, డీఈఓ, చిత్తూరు

కబడ్డీ పోటీలకు మంత్రికి ఆహ్వానం

- మూడురోజులపాటు జరగనున్న కబడ్డీ క్రీడలు
- ప్రారంభానికి హాజరుకానున్న మంత్రి, ఎమ్మెల్యేలు



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆహ్వానిస్తున్న రామచంద్ర, కిషోర్ బాబు

చౌడేపల్లి: స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు రమ్మని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఆహ్వానం అందజేసినట్లు కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్ర తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ నుంచి మూడు రోజులపాటు అండర్–17 బాలబాలికల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితోపాటు ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని ఆహ్వానించామని చెప్పారు. ఈ పోటీలకు ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి బాలబాలికల జట్ల క్రీడాకారులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ చిత్తూరు, రాజంపేట పార్లమెంట్ విభాగం యూత్ అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు, కడియాల మహేష్‌బాబు, పిల్లారి జీవన్ ప్రకాష్, లీలాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ షణ్మోహన్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి తెలిపారు. గురువారం ఓటర్ల జాబితా కసరత్తుపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్‌మీనా విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లాలో చేపడుతున్న కసరత్తును కలెక్టర్ వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనలు పాటిస్తూ పారదర్శకమైన ఓటర్ల జాబితాకు కసరత్తు చేస్తున్నామన్నారు. 18, 19 ఏళ్ల యువ ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించి, నమోదు చేయిస్తున్నట్లు తెలిపారు. డోర్ నంబర్ లేకుండా ఓటుహక్కును కలిగి ఉన ఓటర్ల వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. ఒకే డోర్ నంబర్‌తో 10 కంటే ఎక్కువ ఓటర్లున్నట్‌లెతై పకడ్బందీగా పరిశీలిస్తున్నామని తెలిపారు. జేసీ శ్రీనివాసులు, బ్యాలా, ఉమాపతి, మనోజ్ పాల్గొన్నారు.

'అగ్ని' పరీక్ష..!

నాడు సీతాదేవి.. సతీసావిత్రి.. మండోదరి, అనసూయ తదిత దైవాంశ సంభూతులు అగ్ని పరీక్షలకు సిద్ధపడి తమ పాతివ్రత్యాన్ని నిరూపించుకుని పతివ్రతలుగా పేరు పొందడం మనం పురాణాల ద్వారా తెలుసుకున్నాం. అయితే కలియుగంలోనూ ఓ భర్త తన భార్యకు అగ్ని పరీక్ష పెట్టారు. ఆమె పాతివ్రత్యాన్ని నిరూపించుకోవాలిని ఒత్తిడి చేశాడు. ఇందుకు గ్రామ పెద్దలు సైతం వంతపాడారు. అయితే ఎంపీడీఓ ఈ చర్యలను అడ్డుకుని ఓ మహిళను కాపాడిన సంఘటన పూతలపట్టు మండలం తేనెపల్లెలో వెలుగులోకి వచ్చింది.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: భార్య తప్పు చేస్తే భర్త కొట్టడం, మందలించడం, లేకుంటే గొంతుపై కత్తిపెట్టడం వంటివి తరచూ చూస్తుంటాం. కానీ ఓ భర్త తన భార్య నిజాయితీ నిరూపణ కోసం విన్నూత రీతిలో పరీక్ష పెట్టాడు. సలసలకాగుతున్న నూనెలో చేతులు పెట్టి పాతివ్రత్యాన్ని చాటుకోవాలని బలవంతం చేశాడు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ గౌరి అడ్డుపడ్డారు. వివరాలోకి వెళితే...పూతలపట్టు మండలం తేనేపల్లి ఎస్టీ కాలనీలో ఓ దంపతులకు పెళ్లై పదేళ్లైంది. ఈ దంపతులకు ఆరుగురు పిల్లలున్నారు. భార్యభర్తల మధ్య గొడవలు చిలికి చిలికి గాలివానగా మారింది. భార్యపై భర్తకు రోజురోజుకూ అనుమానం మరింత బలపడింది. దీంతో ఓపిక నశించి నిజాయితీ నిరూపణ పరీక్షకు సిద్ధపడ్డారు. సలసల కాగుతున్న నూనెలో చేతులు పెట్టి నిజాయితీ నిరూపించుకోవాలని వేధించాడు. నూనెలో చేతి కాలకుంటే భార్య నిజాయితీగా ఉన్నట్టన్ని..కాలితే నిజాయితీతో లేన్నట్టని భర్త మొండికేశాడు. గురువారం ఉదయం ఇది భార్యభర్తల మధ్య ఘర్షణకు దారితీసింది. గ్రామస్తుల సమక్షంలో పవిత్ర నిరూపణకు సిద్ధమై, పొయ్యి పెట్టి నూనెను కాంచారు. ఈ విషయం ఆ నోట ఈనోట పడి ఎంపీడీఓ చెవిలో పడింది. వెంటనే ఆమె గ్రామానికి చేరుకుని ఆ వ్యక్తిని మందలించే ప్రయత్నం చేశారు. అయినా అతడు వాదిస్తూ వచ్చాడు. చివరకు ఎంపీడీఓ అతడిని పోలీసులకు అప్పగించి, కౌన్సెలింగ్ ఇప్పించారు. మూఢనమ్మకాల పేరుతో మహిళలను వేధిస్తే చట్ట రీత్యా చర్యలు తప్పవని ఎంపీడీఓ గ్రామస్తులను హెచ్చరించారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకునేలా ఉందని డిప్యూటీ సీఎం కే నారాయణస్వామి తెలిపారు. గురువారం ఆముదాల గ్రామంలోని సచివాలయ ఆవరణలో సర్పంచ్ అనురేఖ, ఎంపీటీసీ సభ్యురాలు లిఖిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో డిప్యూటీ సీఎం కే నారాయణస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సామాజిక న్యాయం, సంక్షేమాభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. నాలుగున్నరేళ్ల పాలనలో ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి నిర్విరామంగా కొనసాగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. అందకే గడప గడపకు మన ప్రభుత్వం, సామాజిక బస్సుయాత్ర, వై ఏపీ నీడ్స్ జగన్ వంటి కార్యక్రమాలు ఏదీ చేపట్టినా ప్రజలు స్వచ్ఛందంగా స్వాగతించడంతోపాటు విశేష మద్దతు తెలుపుతున్నారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ ఉచిత పరీక్షలు చేసి, వ్యాధులున్న వారికి మెరుగైన వైద్యం అందించడంతోపాటు ఉచితంగా మందులు అంద జేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. విద్య, వైద్యానికి పెద్దపీట వేశారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో సైతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు రాష్ట్ర ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ కమిటీ చెర్మన్ శివప్రకాష్‌రాజు, జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, పార్టీ మండల కన్వీనర్ తులసీరామ్ యాదవ్, ఆర్బీకే చైర్మన్ పోలయ్య, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరాజ్, జేసీఎస్ మండల కన్వీనర్ వేణు, పుత్తూరు కేశవరెడ్డి, సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, గాలి మహేష్ బాబు, అయ్యప్ప, సుబ్రమణ్యరెడ్డి, అరుల్, త్యాగరాజ్, జనార్దనాయుడు, షణ్ముగరెడ్డి,సుమన్, మురళి పాల్గొన్నారు.

నేడు మంత్రి అంబటి నగరికి రాక



చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి అంబటి రాంబాబు ఈ నెల 17వ తేదీన నగరికి రానున్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌కు ఉత్తర్వులు అందాయి. ఆయన శుక్రవారం ఉదయం 11.30 గంటలకు నగరికి విచ్చేస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల వరకు నగరిలో జరిగే స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు నగరి నుంచి బయలుదేరి తిరుపతి జిల్లాకు వెళతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



ఎమ్మెల్సీ పల్లె నిద్ర

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి కుప్పం మండలం దాసేగౌనూరు పంచాయితీలో పర్యటించిన అనంతరం రామ్‌నగర్ గ్రామంలో పల్లె నిద్ర చేస్తున్న ఎమ్మెల్సీ భరత్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మురుగేష్ – కుప్పం రూరల్

జనవాక్కు

అభాగ్యులకు సురక్ష



వన్‌బీ.. అడంగల్.. పట్టాదారు పాసు పుస్తకం.. ఆదాయ, కుల ధ్రువీకరణ.. ఇలా ఏ రెవెన్యూ సేవ కావాలన్నా నెలల తరబడి మండల కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షణలు.. వ్యయ ప్రయాసలు.. కాలయాపన.. సొంత పనులకు ఆటంకం కలిగేది.. జగనన్న సురక్ష కార్యక్రమంతో పేదలకు ఇంటి ముంగిటకే 11 రకాల ధ్రువపత్రాలు వచ్చి చేరాయి. ఫలితంగా తిప్పలు తప్పాయి. దీనిపై పేదల జనవాక్కు.. వారి మాటల్లోనే..

– చిత్తూరు కలెక్టరేట్

11 రకాల సర్టిఫికెట్‌లు ఒకే సారి మంజూరు చేశారు



గతంలో కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం కార్యాలయం చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా ఏదో ఒక సాకు చెప్పి తిరిగి పంపించేసేవారు. ధ్రువపత్రాలు ముఖ్యమయ్యా అని అడుక్కున్నప్పటికీ కనికరం చూపించేవారు కాదు. ప్రభుత్వం అమలు చేసిన జగనన్న సురక్ష పథకంలో మా ఇంటికి సమీపంలోనే అధికారులు శిబిరం ఏర్పాటు చేశారు. అందరిని పిలిపించి ఏఏ సర్టిఫికెట్‌లు అవసరమో అడిగి మరీ తెలుసుకుని సర్టిఫికెట్లను ఇంటికే తెచ్చిచారు. ఈ పథకంతో మా కుటుంబానికి అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలు ఉచితంగా అందాయి.

– జాపుర్లాఖాన్, లబ్ధిదారుడు, రామచంద్రరోడ్డు, కుప్పం మున్సిపాలిటీ

చదువులేని కారణంగా ఇబ్బందిగా ఉండేది



చదువుకోలేకపోవడంతో ఆఫీసులకు వెళ్లి ధ్రువపత్రాలు పొందాలంటే ఇబ్బందిగా ఉండేది. కార్యాలయాల్లో అవసరమైన పనులు చేయించుకోవాలంటే ఏమీ తెలియని పరిస్థితి. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియక ఇబ్బంది ఎదుర్కునేదాన్ని. ప్రభుత్వం జగనన్న సురక్ష పథకంలో శిబిరాలు ఏర్పాటు చేశారు. మా గ్రామంలో శిబిరం ఏర్పాటు చేయడంతో నాకు అవసరమైన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను అధికారులు మా ఇంటి వద్దకే తెచ్చిచారు. ఇలాంటి కార్యక్రమం గతంలో ఎప్పుడూ చూడనేలేదు. – మునెమ్మ, లబ్ధిదారు, శ్రీకావేరిరాజపురం

ఇంటి వద్దకే వచ్చి సర్టిఫికెట్లు ఇచ్చారు



గతంలో ఎన్నడూ ఇలాంటి పథకం చూడలేదు. ఇన్‌కం, 1 బీ, అడంగల్ సర్టిఫికెట్ కావాలని గతంలో చాలా సార్లు తహసీల్దార్ ఆఫీసు చుట్టూ తిరిగాను. దరఖాస్తు చేసుకున్నాక చాలా రోజులకు ఇచ్చేవారు. కాళ్లరిగేలా తిరిగి ఇబ్బంది పడేవాళ్లం. జగనన్న సురక్ష పథకం అమలు చేయడంతో అధికారులే మా ఇంటి దగ్గరకు వచ్చారు. మాకు ముఖ్యమైన కుల, ఆదాయ, 1 బీ, అడంగల్ సర్టిఫికెట్లు ఉచితంగా తెచ్చిచారు. ఈ పథకం ఎంతో మేలు చేకూర్చింది.

– మల్లీశ్వరి, లబ్ధిదారు, 35 యర్లంపల్లి ఎస్టీ కాలనీ, ఐరాల మండలం.

ఎవరి సాయం లేకుండానే..



గతంలో ధ్రువపత్రాలు పొందాలంటే ఎవరో ఒకరి సహాయం చేయాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఎవరి సహాయం లేకుండానే అధికారులు ఇంటివద్దకే వచ్చి ధ్రువపత్రాలు ఇచ్చారు. ఇటీవల నా తండ్రి మరణించారు. మా ఇంటికి సంబంధించిన మున్సిపల్ పన్నులు తండ్రి పేరుపైనే ఉన్నాయి. నా పేరు పైకి మార్చుకోవాల్సి వచ్చింది. ఇందుకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అవసరం అయ్యింది. ఆ ధ్రువపత్రం, మరణ ధ్రువీకరణపత్రం ఇస్తేనే ఇంటిపన్నుల వివరాలు మారుస్తామని అధికారులు చెప్పారు. ఆ సమయంలో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించడంతో నాకు అవసరమైన సర్టిఫికెట్లు మా ఇంటి వద్దకే వచ్చి ఇచ్చారు. – నరేంద్ర, లబ్ధిదారుడు, నగరి

అసైన్డ్ భూమిలో రియల్ వ్యాపారం

- కుప్పంలో జనసేన నాయకుడి నిర్వాకం
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



జనసేన నాయకుడు విక్రయిస్తున్న ప్రభుత్వ భూమి

తిరుపతి: గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమికి తన భార్య పేరిట పట్టా పొందిన జనసేన పార్టీ నాయకుడు ఆ భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి దిగాడు. కుప్పం నియోజకవర్గంలోని గుడుపల్లి మండలం గుండ్లసాగరం వద్ద జరిగిన ఈ వ్యవహారంపై గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. గుండ్లసాగరం గ్రామానికి చెందిన జనసేన పార్టీ గుడుపల్లి మండల అధ్యక్షుడు పి.అమీర్ గ్రామానికి సమీపంలోని సర్వే నంబర్ 131/2ఏ, 131/2బి లోని 1.87 ఎకరాల గుట్ట పోరంబోకు భూమిని తనతోపాటు, తన భార్య పేరిట గతంలో డీకేటీ పట్టాలు పొందాడు. అక్కడ ఉన్న గుట్టను అక్రమ మైనింగ్ చేస్తూ కరిగించి కాసులు చేసుకున్నాడు. ఈ భూమి ద్రవిడ యూనివర్సిటీకి వెళ్లే రోడ్డు పక్కనే ఉండడంతో రాతి గుట్టలేని చదునైన ప్రాంతాన్ని చదరపు అడుగుల కింద విక్రయించాడు. ఒక్కో చదరపు అడుగును రూ.500కు పైగా విక్రయించాడు. ఇలా ముగ్గురికి స్థలాలు అమ్మిన అగ్రిమెంట్ల కాపీలతో సహా జిల్లా కలెక్టర్‌కు, కుప్పం ఆర్డీఓలకు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు పంపినట్టు గ్రామస్తులు తెలిపారు. గుట్ట పోరంబోకులో వ్యవసాయం కోసం డీకేటీ పట్టా ఇవ్వడం, దానిని అడ్డు పెట్టుకుని అక్రమంగా విక్రయించడంపై విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని గుండ్లసాగరం వాసులు కోరారు. దీనిపై గుడుపల్లి తహసీల్దార్ గుర్రప్పను వివరణ కోరగా అసైన్డ్ భూమిలో ప్లాట్లు వేసి విక్రయించిన వ్యవహారంపై తమకు ఫిర్యాదు అందిందన్నారు. విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని చెప్పారు.

కట్టమంచి ధీరజ్‌రెడ్డి కన్నుమూత



కట్టమంచి ధీరజ్‌రెడ్డి(ఫైల్)

చిత్తూరు కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చిత్తూరుకు చెందిన కట్టమంచి ధీరజ్ రెడ్డి(35) గుండె సమస్యతో వేలూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీల కార్యకర్తగా ఉంటూ సేవలు అందించి నాయకుడిగా ఎదిగారు. దివంగతనేత వైఎస్సార్ జయంతి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకల సమయంలో కట్టమంచిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కాగా ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి గురువారం రాత్రి ధీరజ్ ఇంటి వద్దకు వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక కట్టమంచిలో దహనక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

వృద్ధురాలిపై అత్యాచారం

బంగారుపాళెం: మండలంలోని పాలమాకులపల్లె వద్ద బుధవారం రాత్రి వృద్ధురాలిపై ఓ యువకుడు అత్యాచారం చేసినట్లు సీఐ నాగరాజరావు తెలిపారు. సీఐ కథనం మేరకు.. పాలమాకులపల్లెకు చెందిన స్వామినాథన్ భార్య మునెమ్మ(75) గ్రామ సమీపంలో తమ మామిడితోటలో మేకలను మేపుకుంటూ అక్కడే చిన్న కొట్టంలో ఉంటోంది. రాత్రి నిద్ర పోతుండగా శేషాపురం దళితవాడకు చెందిన రామమూర్తి(25) తాగిన మైకంలో వృద్ధురాలిని చంపుతానని బెదిరించి, అత్యాచారం చేశాడు. గురువారం బాధితురాలు ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా చాముండేశ్వరి



మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ, జెడ్పీ చైర్మన్

పలమనేరు: మున్సిపల్ చైర్‌పర్సన్‌గా చాముండేశ్వరి నియమితులయ్యారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రిటర్నింగ్ అధికారిగా డీఆర్వో రాజశేఖర్ వ్యవహరించగా పలమనేరు ఆర్డీఓ మనోజ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ ఎంపిక జరిగింది. పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బీసీ మహిళకు రిజర్వు కావడంతో పూర్తిస్థాయిలో కోరం ఉండడంతో ఎన్నిక మొదలైంది. వైఎస్సార్‌సీపీ అధిష్టానం బి.ఫామ్ అందించిన మేరకు చాముండేశ్వరి పేరును అధికారులు ప్రకటించారు. ఇందుకు 9 వార్డు కౌన్సిలర్ కోదండరామయ్య ఆమె పేరును ప్రతిపాదించారు. దీనికి మూడో వార్డు కౌన్సిలర్ ఏకే కిరణ్‌కుమార్ బలపరిచారు. ఇతరులెవరూ పోటీలో లేకపోవడంతో ఆమెను మున్సిపల్ చైర్‌పర్సన్‌గా రిటర్నింగ్ అధికారి ఆమోదించారు. ఆమెతో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ప్రమాణాన్ని చేయించారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ల ఎన్నిక జరిగింది. వైస్ చైర్మన్–1గా గుల్జార్ రహీంఖాన్ పేరును 17 వార్డు కౌన్సిలర్ హైదర్ ప్రతిపాదించగా 15 వార్డు కౌన్సిలర్ బీఆర్సీ కుమార్ ఆమోదించారు. రెండో వైస్ చైర్మన్‌గా రాగిపాళెం రవిని 18 వార్డు కౌన్సిలర్ మండీ సుధ ప్రతిపాదించగా 9 వార్డు కౌన్సిలర్ కోదండరామయ్య ఆమోదించారు. ఈ రెండు పోస్టులకు పోటీ లేకపోవడంతో అధికారులు వీరిని వైస్ చైర్మన్లుగా ఆమోదించారు. కొత్తగా ఎంపికైన మున్సిపల్ చైర్‌పర్సన్, ఇరువురు వైస్ చైర్మన్లను రిటర్నింగ్ అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు వారికి పుష్పగుచ్చాలు అందించి, శాలువలు కప్పి సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, రంగన్న, మురళీకృష్ణ, పార్టీ కన్వీనర్లు జాఫర్, బాలాజీనాయుడు, బాగారెడ్డి, కేశవులు, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, నాయకులు చెంగారెడ్డి, వైస్ ఎంపీపీలు గజేంద్ర, మీసేవా బాబు, సర్పంచుల సంఘ అధ్యక్షులు విశ్వనాథ రెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌పై దాడి

శాంతిపురం: చిన్నారిదొడ్డి పంచాయతీ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.శ్రీనివాసులురెడ్డిపై నడింపల్లెకు చెందిన నలుగురు దాడికి పాల్పడ్డారు. ఈ విషయమై బాధితుడు రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు.. చిన్నారిదొడ్డి సచివాలయంలో గురువారం వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులురెడ్డి విధి నిర్వహణలో ఉన్నారు. ఆ సమయంలో నడింపల్లెకు చెందిన వెంకటేష్, ఆయన కుమారులు మునిరత్నం, చలపతి, కృష్ణప్ప కుమారుడు సుబ్రమణ్యం కలిసి, అక్కడికి వచ్చారు. రేషన్ కార్డులో పేరు చేర్చాలని కోరారు. సర్వర్ పనిచేయలేదని, రేపు రావాలని వెల్ఫేర్ అసిస్టెంట్ చెప్పాడు. దీంతో ఆగ్రహించిన మునిరత్నం అతడిని దుర్భాషలాడాడు. అక్కడే ఉన్న ఇతర సిబ్బంది సర్ది చెప్పినా వినకుండా నలుగురూ కలిసి శ్రీనివాసులురెడ్డిని దూషిస్తూ, పిడిగుద్దులు గుద్దారు. అడ్డువచ్చిన సర్పంచ్ భర్త బాలసుబ్రమణ్యంపైనా దాడి చేశారు. గ్రామస్తులు అక్కడికి చేరుకుని వారిని రక్షించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దాడి విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్సీ భరత్, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి చిన్నారిదొడ్డికి చేరుకుని బాధితులను పరామర్శించారు. కుప్పం రూరల్ సీఐ ఈశ్వరరెడ్డి, రామకుప్పం ఎస్ఐ శివకుమార్ సచివాలయంలో విచారణ జరిపి, నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

160 సంవత్సరాలుగా పోస్టల్ సేవలు

చిత్తూరు కార్పొరేషన్: ప్రజలకు 160 ఏళ్లకు పైగా పోస్టల్ సేవలు అందిస్తున్నట్లు ఆ శాఖ పోస్ట్‌మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి తెలిపారు. జిల్లాలో తొలిసారి చిత్తూరులోని టీటీడీ కల్యాణ మండపంలో కింగ్ ఆఫ్ హాబీస్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను జిల్లా జడ్జి భీమారావు ప్రారంభించారు. అనంతరం ముఖ్యఅతిథులు రిషీవ్యాలీ పాఠశాల ప్రత్యేక పోస్టల్ కవర్‌ను వేదికపై ఆవిష్కరించారు. 1954లో ఫిలాటలీ ప్రదర్శనను ప్రారంభించినట్లు డీఎస్‌వీఆర్ మూర్తి తెలిపారు. దేశ వ్యాప్తంగా 1.50 లక్షల పోస్టాఫీసుల ద్వారా సేవలు అందిస్తున్నామని చెప్పారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల సేవలు పోస్ట్‌మ్యాన్ ఇంటి వద్దకే వెళ్లి అందిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీస్ జగదీష్ చెప్పారు. జాతీయ రంగంలో పలు శాఖల సేవలు కనుమరుగవుతున్నా.. నేటికీ రైల్వే, పోస్టల్ సేవలు దిగ్విజయంగా నడుస్తున్నాయని తెలిపారు. నేటి డిజిటల్ కాలం పిల్లలకు పోస్టల్ సేవలు గురించి పెద్దగా తెలియవని ద్రవిడ యూనివర్సిటీ ఉపకులపతి తుమ్మల రామకృష్ణ అన్నారు. అప్పట్లో పోస్ట్‌మ్యాన్‌కు ఉన్న గౌరవం వెలకట్టలేనిదన్నారు. కాలానుగుణంగా పోస్టల్ సేవల్లో ఆధునికీకరణ జరుగుతుందన్నారు. ఎస్ఎస్‌పీలు జాఫర్‌సాధిక్, లక్ష్మణ్, పోస్ట్ మాస్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తి, ఐజీతో ఎస్పీ భేటీ



వెంకటకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా ఎస్పీ



సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ అరవింద్ కుమార్‌కు..

కాణిపాకం(యాదమరి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, సీఆర్‌పీఎఫ్ ఐజీ వెంకటకృష్ణను చిత్తూరు జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి కాణిపాకంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం వారు స్వామివారి దర్శనార్థం విచ్చేసి, అనంతరం అతిథి గృహంలో ఉండగా ఎస్పీ ఇరువురిని వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న గ్రంథాలయ చైర్‌పర్సన్ మధుబాల, చిత్రంలో శ్రీనివాసులురెడ్డి

పుంగనూరు: మానసిక వికాసానికి ప్రతి ఒక్కరు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎన్.మధుబాల పిలుపునిచ్చారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాల్లో జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డితో కలసి ఆమె పాల్గొన్నారు. ఆమెకు గ్రంథాలయాధికారి తులసీ నాయక్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన, వకృత్వ పోటీలు నిర్వహించి, బహుమతులు అందిస్తున్నామన్నారు. విద్యార్థులందరు క్రమశిక్షణతో ప్రతిరోజు గ్రంథాలయాలకు వెళ్లడం అలవర్చుకోవాలన్నారు. పుస్తకపఠనంతో మానసిక ఉల్లాసం, విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత తెలుగు పండితులు వెంకటపతి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కులగణన



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో కులగణన కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని డీఆర్వో రాజశేఖర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో పలు శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణనతో సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా చేర్చవచ్చని తెలిపారు. స్వాతంత్ర్యానికి ముందు 1931లో కులగణన ను చేపట్టారన్నారు. ఆ నివేదికల ఆధారంగానే నేటికీ ప్రణాళికలు రూపొందుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కులగణన కార్యక్రమం చేపట్టేందుకు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. సచివాలయం యూనిట్‌గా తీసుకుని సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సహకారంతో కుటుంబాల నుంచి వ్యక్తిగత సమాచారం, సామాజిక హోదాకు సంబంధించిన సమాచారం సేకరించాల్సి ఉందన్నారు. ఈ సమాచారాన్ని ప్రజలు స్వచ్ఛందంగా తెలియజేయాలని చెప్పారు. ప్రజల నుంచి సేకరించే సమాచారం గోప్యంగా ప్రభుత్వ రక్షణ లో ఉంటుందన్నారు.

నేటి నుంచి మండల స్థాయి అధికారులకు శిక్షణ

కులగణన కార్యక్రమం అమలుపై ఈ నెల 17,18 తేదీల్లో మండల స్థాయి అధికారులకు మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ఇవ్వనున్నట్లు డీఆర్వో చెప్పారు. ఆ తర్వాత మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి ఈ నెల 24వ తేదీలోపు శిక్షణ ఇస్తారన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో సర్వే ప్రారంభమవుతుందన్నారు. ఈ శిక్షణకు నోడల్ అధికారిగా జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో రాజ్యలక్ష్మి, రబ్బానిబాషా, చిన్నారెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రూ.రెండొందలు తీసుకో.. ఫొటోకు ఫోజిచ్చుకో..



మాట్లాడుతున్న కుప్పయ్య

శ్రీరంగరాజపురం: 'రూ.రెండు వందలు తీసుకోండి.. ఫొటోకు ఫోజు ఇవ్వండి' అని గంగాధరనెల్లూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ ప్రజలను అభ్యర్థిస్తున్నారు. మండలంలోని వెంకటాపురం సచివాలయం పరిధిలో పొదలపల్లె దళితవాడలో మీ ఇంటికే మీ థామస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనం లేక వెలవెలబోయింది. ప్రతి ఇంటికీ వెళ్లి రూ.200 ఇచ్చి తన వెంటా నడిస్తే మీకు మరిన్ని డబ్బులు ఇస్తామని చెప్పారు. అయినా జనం రాకపోవడంతో గంగాధరనెల్లూరు మండలంలోని కొండేపల్లెలో తమ గ్రామానికి చెందిన బంధువు అంత్యక్రియలకు వెళుతున్న వారిని పిలిచి రూ.200 తీసుకోండి ఫొటోకు ఫోజు ఇవ్వండి అని చెప్పి వారికి పార్టీ కండువా వేసి పార్టీలో చేరినట్లు ప్రచారం చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తమ గ్రామం ఎప్పటికీ వైఎస్సార్‌సీపీ కంచు కోట అని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుప్పయ్య మాట్లాడుతూ టీడీపీ అధినేతకు తాము ఏ మాత్రం తీసిపోమని అన్నట్లు థామస్ వ్యవహారశైలి ఉందన్నారు. శ్రీరంగరాజపురం మండలం వైఎస్సార్ సీపీ పార్టీకి కంచుకోట అని అన్నారు. టీడీపీ ఎన్ని కుప్పి గంతులు వేసిన ప్రజలు నమ్మే పరిస్థితిలో లేదన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం

సదుం: ఉద్యోగాల పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మారుతి తెలిపారు. ఆయన గురువారం విలేకరులకు ఈ వివరాలు వెల్లడించారు. సదుం మండలం కొత్తపల్లెకు చెందిన గురుమూర్తి అలియాస్ చిన్నా పలువురు ప్రముఖుల పేర్లు చెప్పి ప్రభుత్వ పాఠశాలల్లో యోగా టీచర్లుగా ఉద్యోగం ఇప్పిస్తానని పది మంది నుంచి రూ.15 లక్షలు వసూలు చేశాడు. అనంతరం వారిని ప్రభుత్వ పాఠశాలలకు పంపించాడు. ఎన్ని రోజులైనా జీతం రాకపోవడంతో వారు అతన్ని నిలదీశారు. బూరగమందకు చెందిన బాధితుడు రెడ్డి ఈ విషయమై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

కర్ణాటక మద్యం సీజ్.. నిందితుడి అరెస్టు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం కలిగి ఉన్న కె. సుందరేష్ అనే నిందితుడ్ని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) చిత్తూరు రూరల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బంగారుపాళెం మండలం టేకుమంద గ్రామంలో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పంద్యాలమడుగు చెందిన సుందరేషన్ ఓ ద్విచక్రవాహనంలో సంచితో వెళుతుండగా ఆపి, తనిఖీ చేశారు. ఈ సంచిలో 130 కర్ణాటక మద్యం ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. వాహనం సీజ్ చేసి, నిందితుడ్ని అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించారు.

వివాహిత ఆత్మహత్య



నీరజ(ఫైల్)

వి.కోట: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గోనుమాకులపల్లి పంచాయతీలో గురువారం చోటు చేసుకుంది. సీఐ కథనం మేరకు.. మండలంలోని గోనుమాకులపల్లెలో మోహన్‌బాబు, నీరజ(40) దంపతులు హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఏమి జరిగిందో తెలియదు కానీ నీరజ గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకుంది. ఆమె ఇంట్లో నుంచి ఉదయం నుంచి బయటకు రాకపోవడంతో స్థానికులకు అనుమానం వచ్చి, పరిశీలించగా బాత్‌రూమ్‌లో ఉరివేసుకున్నట్లు గుర్తించి, పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసుల సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్యాభర్తలు వారం రోజులుగా గొడవ పడుతున్నట్లు స్థానికులు పోలీసులకు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగప్ప తెలిపారు.

పక్కాగా ఓటర్ల జాబితా

గుడిపాల: ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం రాత్రి ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివాహమైన వారికి నోటీసులు అందజేసి, ఓటును వారున్న ప్రాంతానికి మార్చడం కానీ, లేక తొలగించడం గానీ చేయాలన్నారు. ఒకే డోర్ నంబర్‌తో ఎక్కువ ఓటర్లు ఉన్న వారిని మరొకసారి తనిఖీ చేయాలన్నారు. కొత్తగా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు క్షుణ్ణంగా పరిశీలించడంతోపాటు మరణించిన వారి పేర్లు కూడా తీసివేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, డీటీ వంశీకృష్ణ పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఓ రవిరాజు

చిత్తూరు రూరల్: మాతా శిశు మరణాల నివారణకు వైద్య బృందం కలసికట్టుగా కృషి చేయాలని డీఐఓ రవిరాజు సూచించారు. చిత్తూరు నగరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం మాతా శిశు మరణాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. గర్భవతి గుర్తింపులో ఆలస్యం ఉండకూడదన్నారు. ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు విధిగా గర్భవతులను పర్యవేక్షించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ హైరిస్క్ గర్భిణుల విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించి సుఖ ప్రసవం అయ్యేలా చూడాలన్నారు. వైద్యాధికారులు లత పాల్గొన్నారు.